# ఆదిమానవిని ఆవాహన చేస్తున్న కవయిత్రులు

సమాజంలో తన అస్తిత్వాన్ని స్థిరీకరించుకొనే ప్రయత్నంలో అవిశ్రాంతంగా పోరాటం సలుపుతున్న ఆధునిక స్త్రీ మూర్తి కవితల ద్వారా తనను తాను సమాజానికి పరిచయం చేసుకుంటున్నది. స్త్రీని, స్త్రీకి సంబంధించిన ఎన్నో సమస్యలను కేంద్ర బిందువులుగా తీసుకొని స్త్రీ జీవితంలోని ఎన్నో అనుభూతులనూ, అనుభవాలనూ వ్యక్తీకరిస్తూ నేడు స్త్రీలే వ్రాస్తున్న కవిత్వం స్త్రీల చైతన్యాన్ని అక్షరాలలో రూపుకట్టిస్తూ ఉంది. శతాబ్దాలుగా, తరతరాలుగా గుర్తించి సంస్కరించవలసి ఉండి కూడా నిర్లక్ష్యం చేయబడి హేయమైన, దీనమైన స్థితిలో ఉన్న స్త్రీని ఆమె దృక్కోణంలో నుండి పరిశీలించి వెలువరిస్తున్న కవిత్వం స్త్రీవాద కవిత్వం. స్వాతంత్ర్యానంతర కాలంలో ముఖ్యంగా 1960 తరువాత వెలువడిన సాహిత్యంలో సమాజంలోని సాంప్రదాయకరమైన స్త్రీ పాత్రను, పరిస్థితిని గురించి అతి తీవ్రంగా ప్రశ్నించడం జరుగుతున్నది. యుగాలుగా స్త్రీ జీవితంలో వచ్చిన అణిచివేతల పరిణామక్రమాన్ని సహేతుకంగా వివరిస్తూ, అపోహలను ఖండిస్తూ స్త్రీ శారీరక, మానసిక సమస్యలను విస్తృతంగా చర్చిస్తున్న భావపరంపరతో నేటి కవయిత్రులు తమ సమస్యలపట్ల తామే స్పందించి, సంకోచాల సంకెళ్ళను తెంచి పురుషాధిక్య సమాజంపైన చెయ్యెత్తి వ్రాస్తున్నదే స్త్రీవాద కవిత్వం.

ఓడినా సరే,
ఎవరి యుద్ధం వాళ్ళే చేయాలి
నీకోసం వాళ్ళు యుద్ధం గెలిచారో
నిలువునా మునిగిపోతావు
ఎప్పటికీ విరిగిపోతావు (సుధ) అంటూ స్త్రీ జాతిని హెచ్చరించి మేల్కొలిపే మహాయజ్ఞాలు చేస్తున్నారు.

త్రాచుల రేచుల ధనంజయుల ఆజ్ఞాపనలో
కనుకున్న పసికందును పారేసుకున్నా
కన్నీళ్ళు రానివ్వక
విప్లవ ధర్మంగా వెనుతిరుగక వర్తించి
నమ్మకంగా తమ సంకెళ్ళు తెగుతాయనుకొని
తుపాకులు మోసిన, విప్లవ స్త్రీ సైన్యం
"విప్లవావసరాలు తీరేక మౌనంగా, దీనంగా
తిరిగి వంటిళ్ళలో మగ్గటం" పట్ల నిరసనను వ్యక్తం చేస్తారు జయప్రభ.

ఇరవయ్యో శతాబ్దాంతానికి కూడా ఇంకా స్త్రీలు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో వెనకబడే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 35,886 మంది పురుషులు ప్రపంచలోని వివిధ పార్ల[illegible] స్త్రీ సభ్యులు ఉన్నారు. ఇండియాలో స్త్రీ పార్లమెంట్ సభ్యుల శాతం కేవలం 7.3 శాతం మాత్రమే. ఇంక సమానత్వం ఎక్కడ? అని మనం ప్రశ్నించుకోవలసి ఉంది. జాతిలో సగభాగమైన స్త్రీని వివక్షకు గురిచేసి అట్టడుగుకు తోసేసే సమాజం పట్ల నిరసన చూపిస్తూ,

"ఎవరి కళ్ళ సజీవ భాష్యానికి వారే భావం
చెప్పటం తట్టుకోలేరు
వధ్యశిలల మధ్యనే వైద్యశాలల నిర్మాణం ఒప్పుకోలేరు
వర్ణనీయ వస్తువే తిరగబడి వర్ణిస్తే గుక్కతిప్పుకోలేరు.
అంటూ స్త్రీవాద కవిత్వం పట్ల పురుషుల అసహనాన్ని ఎత్తిపొడిచారు నిర్మల.

ఈమె
"పురుషుడి ప్రేమలో తడిసిన తాజ్‌మహల్ రాళ్ళ వెనుక
పద్మాలుగో ప్రసూతి నరకాన కన్నుమూసిన పురిటాలి ఆత్మ" ను దర్శించి తన "బాధాశప్తనది" లో ప్రకటించారు.

ఈ తరహా కవిత్వం ద్వారా చాలావరకు వరకట్నం, మానభంగాలు, గర్భధారణ, గర్భస్రావం, ప్రసూతి, వేశ్యావృత్తి, మధ్య తరగతి రాజీసంసారాలలోని స్త్రీల మానసిక, శారీరక ఇబ్బందులు ఒకటేమిటి స్త్రీ జీవితానికి సంబంధించిన అనేకానేక సమస్యల పరిష్కారానికి స్పష్టమైన అవగాహనతో పరిష్కారాలను కూడా సూచిస్తే స్త్రీవాద కవిత్వం పరిపూర్ణతను సంతరించుకుంటుంది. అయితే పరిష్కారాలను సూచించడానికి ప్రయత్నించిన కొన్ని కవితలు కూడా లేకపోలేదు. "ఇదే సుమా నీ జీవితం" స్త్రీ జీవితంలోని ప్రతి సున్నితమైన కోణాన్ని పట్టించుకొని సత్యాలను ఆమె ముందు పరచి ఉత్తేజితురాలిని చేసే ప్రయత్నంలో స్త్రీవాద కవయిత్రులు సఫలీకృతులవుతున్నారనే చెప్పవచ్చు.

" మా వంటింటికి మా అమ్మే మహారాణి"
కానీ వంటగిన్నెలన్నింటి మీదా మా నాన్న పేరే" అని సున్నితంగా సత్యాన్ని చెబుతూనే,
"మన పిల్లల కోసం
వంటరి వంటగదుల్ని కూల్చేద్దాం రండి"
అన్న పిలుపులో భావితరాలపట్ల మనం నిర్వహించవలసిన కర్తవ్యాన్ని తెలుపుతున్నారు విమల.

ఈమె, శరీరాన్ని సౌందర్యాత్మకంగా తీర్చిదిద్దుకోవాలన్న తపనతో సామాజిక బాధ్యతనూ, వ్యక్తిత్వాన్నీ నిర్లక్ష్యం చేస్తున్న స్త్రీలకు-
"రేగిన జుట్టుతో, అలసిన కళ్ళతో చింకిపాతలతో,
అందాన్ని 'ఖరీదు చేయలేని' కోట్లాది మంది స్త్రీల
అందహీనతని మనం ప్రేమిద్దాం
శ్రమ సౌందర్యాన్నీ, మానవ విలువల్నీ
ప్రేమిద్దాం" రమ్మని పిలుపునిస్తున్నారు.
"మనసిచ్చిన వాడినుంచి కూడా
బ్రతుకును భద్రంగా దాచుకోవాలన్న" జాగ్రత్తను నేర్పుతున్నారు.

అయితే మరో కోణం నుంచి,

"we began to think well, what's the use of sexual freedom if it only leads to this terrible loneliness. we experimented with things that our mothers and fathers could't and then we realised that that was not the solution, we then began to reformulate feminism"

ప్రఖ్యాత అమెరికన్ ఫెమినిస్టు ఎరికాజంగ్ స్త్రీవాద దృక్పథంలో మార్పులు రావటం అవసరమని 6-2-94న హిందూ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూచించారు.

"భారతదేశపు గ్రామీణ స్త్రీలు త్రాగడానికి మంచినీళ్ళు
లేక ఇబ్బందులు పడుతుంటే మేము లైంగిక స్వేచ్ఛ
గురించి ఎలా మాట్లాడగలం?" - అని ప్రముఖ ఫెమినిస్టు మధు కిష్వర్ లైంగిక స్వేచ్ఛ గురించి ప్రశ్నించినప్పుడు సమాధానం ఇచ్చింది.

పాశ్చాత్య దేశాలలోని ఫెమినిస్టు ఉద్యమ సిద్ధాంతాలు మనదేశానికి వర్తించవనీ, వ్యక్తి కుటుంబాలకంటే సమిష్టి కుటుంబాలనే ఫెమినిస్టులు సమర్థిస్తారని ఆమె తెలిపారు.

అయితే స్త్రీవాద కవిత్వం సమాజంలోని అన్ని వర్గాల మహిళలనూ ప్రభావితం చేయగలగాలి. మనది ఆర్థికంగా చాలా వెనుకబడిన దేశం. స్థూలంగా ఆలోచిస్తే ప్రొద్దున లేచిన దగ్గర్నుంచీ గుప్పెడు మెతుకుల కోసం రెక్కలు ముక్కలు చేసుకొనే మనదేశపు ఆడవాళ్ళకు లైంగిక స్వేచ్ఛ గురించిన అవగాహన కల్పించే అవసరం అంతగా లేదేమోనని అన్పిస్తుంది. నరకం వంటి పేదరికంలో మగ్గుతూ క్షణం ఒక పోరాటంగా బ్రతికే భారత స్త్రీ ఈనాడు ఇంటా, బయటా ఎదుర్కొనే సమస్యలు ఎన్నో. స్త్రీవాదులు తమ పరిధిని విస్తృతం చేసుకొని సమాజంలోని అన్ని వర్ణాల, వర్గాల మహిళల సమస్యలనూ పరిగణనలోకి తీసుకొని ఈ దేశపు స్త్రీకి తన కాళ్ళ మీద తాను నిలబడగలిగే ధైర్యాన్ని నూరిపోయాలి. ప్రతి స్త్రీ తాను ఒక అబలకాదు, తనలోనూ కొంత శక్తి ఉంది దానితో తాను ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోగలనన్న ఆలోచననూ, ఆత్మవిశ్వాసాన్నీ కల్గించే బాధ్యత స్త్రీలదే...వారు వ్రాసే శక్తివంతమైన కవిత్వానిదే. సమస్యను విశ్లేషించి చూపి భయపెట్టేకన్నా తమంత తాముగా పరిష్కరించుకోగలిగే ఉత్తేజం స్త్రీ జాతిలో కలిగించే ఇస్మత్ చుగ్తాయ్ వంటి రచయిత్రుల సాహిత్యం మన తెలుగులో కూడా రావాలి. ఆ బాధ్యత ఆవేదన, ఆర్ద్రత, ఆవేశం అంతర్లీనంగా, శక్తివంతమైన కవిత్వాన్ని వెలువరిస్తున్న స్త్రీవాదులు తీసుకోవాలి.

— కోడూరి దుర్గానాగరాజు